సాక్షి
తిరుపతి
గురువారం । 26 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.59,000

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,270

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000

రిటైల్ వెండి గ్రాము రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	31	17
చిత్తూరు	31	17
తిరుమల	27	13
గూడూరు	31	20
నగరి	32	18



సైకత గణతంత్రం

చిల్లకూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని సముద్రతీరం వద్ద ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ సైకత శిల్పం రూపొందించారు.

న్యూస్‌రీల్

భారీ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ రేపు

పాకాల : స్థానిక ఆనందగిరి కొండపై 54 అడుగుల భారీ సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఈ నెల 27వ తేదీ భూమి పూజ చేయనున్నారు. శ్రీవల్లిదేవసేన సేమత సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి బుధవారం మాట్లాడుతూ భూమి పూజ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు భక్తులందరూ హాజరుకావచ్చని చైర్మన్ కోరారు.

బెస్ట్ డివిజన్‌గా తిరుపతి టౌన్

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో అడిషనల్ లోడ్ నమోదు విభాగంలో తిరుపతి టౌన్ డివిజన్ ఉత్తమ డివిజన్‌గా ఎంపికైంది. ఉత్తమ విభాగంగా తిరుపతి సౌత్ సెక్షన్ నిలిచింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మొత్తం 11 విభాగాల్లో అవార్డులను ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ప్రకటించారు. ఇందులో బెస్ట్ సర్కిల్‌గా కర్నూలు, బెస్ట్ డివిజన్‌గా నాయుడుపేట, సబ్‌డివిజన్‌గా కర్నూలు ఆపరేషన్, వందశాతం రెవెన్యూ వసూళ్లలో బెస్ట్ డివిజన్ కదిరి, సబ్‌డివిజన్ గుడూరు టౌన్, సెక్షన్ కల్యాణదుర్గం, బెస్ట్ ఏఏఓ కల్యాణదుర్గం, తక్కువ 11కేవీ ఫీడర్ల అంతరాయాల విభాగంలో బెస్ట్ డివిజన్‌గా పులివెందుల, సబ్‌డివిజన్-నెల్లూరు, సెక్షన్ అనంతపురం, తక్కువ ప్రమాదాల నమోదులో పీలేరు డివిజన్ ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది. ఫిర్యాదు పరిష్కార విభాగంలో బెస్ట్ డివిజన్‌గా మైదుకూరు, సబ్‌డివిజన్‌గా బేతంచర్ల, సెక్షన్‌గా కొడూరు, బెస్ట్ ఎంఅండ్‌పీ డివిజన్‌గా తిరుపతి, ఉత్తమ ట్రాన్స్‌ఫార్మర్స్ డివిజన్‌గా కర్నూలు, ఉత్తమ డీపీఈ డివిజన్‌గా నెల్లూరు-2, ఉత్తమ కన్‌స్ట్రక్షన్ డివిజన్‌గా కడప, బెస్ట్ ఎస్‌ఏఓగా కడప అవార్డులకు ఎంపిక చేసినట్లు సీఎండీ సంతోషరావు తెలిపారు. గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సీఎండీ సంతోషరావు చేతుల మీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.50 నుంచి 11 గంటల వరకు సరస్వతి అష్టోత్తరం, 11.04 నుంచి 12గంటల వరకు అక్షర స్వీకారం ఉంటుందన్నారు. వివరాలకు 75695 91994, 90008 11568 ను సంప్రదించాలన్నారు.

ఎస్వీబీసీ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం



ఒప్పందం చేసుకుంటున్న రెడ్డెప్పరెడ్డి, షణ్ముఖ్‌కుమార్

తిరుపతి తుడా : టీటీడీ ఎస్వీబీసీ ఉద్యోగులకు బర్డ్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు బర్డ్ ఆస్పత్రి ప్రత్యేక అధికారి రెడ్డెప్పరెడ్డి, ఎస్వీబీసీ సీఈవో వైదీకే షణ్ముఖ్‌కుమార్ ఒప్పంద పత్రాలను బుధవారం మార్చుకున్నారు. ఎస్వీబీసీ ఉద్యోగులకు ఇక బర్డ్ ఆస్పత్రిలో నగదు రహితంగా వైద్యం అందించనున్నారు. దీనికి సంబంధించిన నగదును ఆరోగ్య భద్రత ద్వారా బర్డ్‌కు జమ చేస్తారు.

స్విమ్స్ ఓపీకి నేడు సెలవు

తిరుపతి తుడా : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో గురువారం ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటించినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు.

ఆధ్యాత్మిక యాత్రలో అంతులేని విషాదం

యువకులు చేపట్టిన ఆధ్యాత్మిక యాత్ర వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగిల్చింది. ఈ యాత్రలో మొదటి క్షేత్రం తిరుమల శ్రీవారిని మాత్రమే ఆ బృందం దర్శించుకోగలిగింది. అనంతరం అక్కడి నుంచి విఘ్ననాయకుడి దర్శనానికి బయల్దేరింది. విరామం లేని సుదూర ప్రయాణంలో డ్రైవర్‌కు విశ్రాంతి కరువైంది. అదే సమయంలో మృత్యువు వెంటాడి సగం మందిని కబళించేసింది. మిగిలినవారి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారమందుకున్న యువకుల కుటుంబాల్లో తీరని శోకం నిండిపోయింది.

- కల్వర్టును ఢీకొన్న కారు
- ఐదుగురి దుర్మరణం
- మరో నలుగురి పరిస్థితి విషమం
- వీడియో కాల్ ద్వారా మృతులను గుర్తించిన కుటుంబీకులు



కల్వర్టును ఢీకొన్న కారు (ఇన్‌సెట్) రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చంద్రగిరి: మహారాష్ట్రలోని 9 మంది మిత్రుల బృందం ఆధ్యాత్మిక యాత్రకు బయల్దేరింది. సోలాపూర్‌కు చెందిన రాహుల్ ఇరాని(డ్రైవరు), అంతర్ అనంత్ తెంబుకర్, మయూర్ మట్టన్, రిషికేష్ జంగం, అజయ్ నంగ్‌నాథ్ లుత్తే, సునీల్, యాష్ పాటిల్, రోహన్ ఇరాని(డ్రైవరు), సుగన్వ నీల్కర్, సునీల్‌లు ఆధ్యాత్మిక యాత్రకు సోమవారం టవేరా వాహనంలో పయనమయ్యారు. మంగళవారం రాత్రి తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుని అర్ధరాత్రి తిరుపతికి చేరుకుని అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం మిత్రులందరూ అల్పాహారం స్వీకరించి, ముందుగా కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడానికి బయల్దేరారు. చంద్రగిరి మండలంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి వద్ద వెళ్తున్న క్రమంలో వాహనం రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అంతర్ అనంత్ తెంబుకర్(20), మయూర్ మట్టన్(25), రిషికేష్ జంగం (30), అజయ్ నంగ్‌నాథ్ లుత్తే(31) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటన స్థలంలో భారీ శబ్దం రావడంతో ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది మిగిలిన ఐదుగురి క్షతగాత్రులను హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ అంబదాస్ కుమార్(22) మృతి చెందగా, మిగిలిన నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

సుమారు 900 కి.మీ. ప్రయాణం

సుమారు 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న సోలాపూర్ నుంచి కారులో రావడంతో పాటు డ్రైవరుకు విశ్రాంతి లేకపోవడం ప్రమాదానికి కారణాలుగా తెలుస్తోంది. ఇద్దరు డ్రైవర్లు ఉన్నప్పటికీ వాహనాన్ని ఎవరు నడపారనేది స్పష్టంగా తెలియరాలేదు. కారులో సామర్థ్యానికి మించి ప్రయాణించడం ప్రమాదానికి ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు.

వీడియో కాల్ ద్వారా మృతులు, క్షతగాత్రుల గుర్తింపు

ప్రమాదంలో మృతి చెందిన మృతులు, క్షతగాత్రుల వివరాలను సీఐ ఓబులేసు వీడియో కాల్ ద్వారా గుర్తించారు. ప్రమాదం జరిగిన అనంతరం మృతులకు సంబంధించిన కొన్ని సెల్‌ఫోన్లకు కాల్స్ రావడంతో జరిగిన ప్రమాదాన్ని ఆయన వివరించారు. తమ వారిని వీడియో కాల్ ద్వారా చూపించాలని కోరడంతో వారి అభ్యర్థన మేరకు ఆయన వీడియో కాల్ చేశారు. ఈ క్రమంలో మృతి చెందిన వారితో పాటు గాయపడిన వారి వివరాలను తెలుసుకున్నారు.

శభాష్ పోలీస్...

ఆధ్యాత్మిక యాత్రకు వచ్చి రోడ్డు ప్రమాదంలో కొందరు మృతి చెందగా మరికొందరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ దీన స్థితిలో ఉన్నారు. ఊరు గాని ఊరు వచ్చి దిక్కులేని స్థితిలో ఉన్న యాత్రికులకు పోలీసులు అండగా నిలిచారు. బాధిత బంధువులతో చంద్రగిరి సీఐ ఓబులేసు నిత్యం మాట్లాడుతూ సమాచారం ఇవ్వడమే కాకుండా మెరుగైన చికిత్స ఇప్పించేందుకు రుయా అధికారులతో సంప్రదిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ

ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు నరసప్ప, విజయశేఖర్, సీఐ ఓబులేసు తమ సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన భక్తులు కాణిపాకం వెళ్లి అక్కడి నుంచి వేలూరులోని గోల్డెన్ టెంపుల్ వెళ్లేందుకు బయల్దేరారని చెప్పారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగి ఐదుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆయన తెలిపారు. కల్వర్టును ఢీకొన్న క్రమంలో కారు ఎక్కడా బ్రేకులు వేసినట్లు కానీ, స్కిడ్ అయిన గుర్తులు కానీ కనిపించలేదన్నారు. అతివేగం కారణమా లేదా డ్రైవరు నిద్రలోకి జారుకున్నాడా, లేకపోతే మరేదైనా కారణాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



మృతదేహాలను సిబ్బందితో కలసి వ్యానులోకి ఎక్కిస్తున్న సీఐ ఓబులేసు

పాతుకుపోయిన ఆర్టీసీ యూనియన్ నేతలు

- బదిలీ అయినా డెప్యుటేషన్‌పై తిరుపతిలో డ్యూటీలు

తిరుపతి అర్బన్: యూనియన్లు ఆర్టీసీకి శాపంగా మారుతున్నాయి. కొందరు యూనియన్ నాయకులు బదిలీ చేసినా, మళ్లీ ఉన్నచోటుకే వచ్చేసి పాతుకుపోయారు. వీరు డ్యూటీలు సక్రమంగా చేయకుండా, పనిచేసేవారిని చేయనివ్వకపోవడంతో సంస్థ నష్టాల బాట పట్టింది. అప్పట్లో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదుకున్నారు. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులయ్యారు. వైఎస్ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామంటూ సమావేశాల్లో చెబుతుంటారు. అయితే కొందరు ఉద్యోగులు యూనియన్ నేతల ముసుగులో దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు. ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినా మళ్లీ ఉన్న చోటుకే వచ్చేస్తున్నారు. బదిలీకి చాన్స్ లేకుంటే డెప్యుటేషన్ పేరుతో తిరుపతికి వచ్చేస్తున్నారు. వచ్చిన తరువాత డ్యూటీలు కూడా సక్రమంగా చేయరు. ఎవరైనా అడిగితే యూనియన్ వ్యవహారాల్లో తలమునకలై ఉన్నామంటూ గొప్పలు చెప్పడం ప్రారంభిస్తారు. తిరుపతి డిపోతోపాటు సమీప ప్రాంతాల్లోనే సర్వీస్ మొత్తం గడిపేస్తున్నారు. ఉదాహరణకు తిరుపతి బస్టాండ్‌లో రాత్రి 7.30 గంటలు దాటితే ట్రాఫిక్‌ను నియంత్రించే ఉద్యోగులు కనిపించరు. ఈ ప్రభావం బస్సు రాకపోకల మీద పడుతోంది. రాత్రుల్లో బస్సును బస్టాండ్ నుంచి బయటకు తీసుకురావడానికి 30 నుంచి 40 నిముషాల సమయం పడుతుంది. బస్టాండ్‌లో చోరీలకు ఢోకా లేదు. ప్రయాణికులు పదుల సంఖ్యలో బస్టాండ్‌లోనే తిష్ట వేస్తుంటారు. రోజుల తరబడి బస్టాండులోనే ఉన్నా ప్రశ్నించే వారే లేకపోవడం గమనార్హం. ఇలాంటి వారే చోరీలకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ పెద్దలు ముందుగా యూనియన్ పేరుతో డ్యూటీలు చేయని వారిపై దృష్టి పెట్టాల్సి ఉంది. లేదంటే వారు డ్యూటీలు చేయకపోగా, బుద్ధిగా డ్యూటీలు చేసుకుంటున్న మరో పదిమందిని సోమర్లుగా మార్చేసే ప్రమాదం ఉంది.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



వెంకట దాసరపల్లెలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- వెంకట దానరపల్లెలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధితోపాటు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం మండలంలోని వెంకట దాసరపల్లెలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి, సేవలు త్వరితగతిన అందేలా చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, పోకల చంద్ర, నాదమునిరెడ్డి, సర్పంచ్ లక్ష్మి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేత



పార్టీలో చేరిన కరీం సాహెబ్‌తో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ ముస్లిం మైనారిటీ మండల వైస్ ప్రెసిడెంట్, బూరగమంద వార్డు సభ్యుడు కరీంసాహెబ్ బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి స్వగృహం వద్ద ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఆకర్షితుడై పార్టీలో చేరినట్టు కరీం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భగీరథరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేద భాష్య సంగోష్ఠి



మాట్లాడుతున్న ఆచార్య రాణి సదాశివమూర్తి

తిరుపతి అలిపిరి: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా యజుర్వేద ఆగ్న్యాధాన ప్రకరణ విచారః అను పేరుతో నిర్వహించిన వేదభాష్య సంగోష్ఠి బుధవారం ముగిసింది. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి పాల్గొన్నారు. ముందుగా సదస్సు సంచాలకులు డాక్టర్ రామకృష్ణ సోమయాజి సదస్సు నివేదిక సమర్పించారు. అనంతరం సభాధ్యక్షులు కులపతి మాట్లాడుతూ సనాతన సంప్రదాయంలో అగ్ని వైశిష్ట్యం తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకాయ ప్రముఖులు డా.ఫణియాజులు, రిజిస్ట్రార్ డా.ఏ.వి రాధేశ్యాం, పిఆర్వో డా.బ్రహ్మాచార్యులు, శ్రీనాథశర్మ అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం వసంత పంచమి వేడుకలు రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

నేడు గణతంత్ర వేడుకలు

తిరుపతి అర్బన్: నగరంలోని న్యూ బాలాజీ కాలనీ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఎం.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి 11.55 గంటలకు పలు కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరుకానున్నారని వెల్లడించారు. 17 స్టాల్స్‌ను, 8శకటాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఓటుతోనే దేశ భవిష్యత్తు


ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలిని సత్కరిస్తున్న కలెక్టర్


3 కే రన్‌లో పాల్గొన్న విద్యార్థినులు, యువకులు

- జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- పర్యాటక దినోత్సవం సందర్భంగా 3కేరన్

తిరుచానూరు: ఓటుతోనే దేశ భవిష్యత్తు నిర్ణయించవచ్చని, ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి అన్నారు. బుధవారం ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. యువత వినియోగించుకునే ఓటు హక్కుపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. జిల్లాలో13,500 మంది నూతన ఓటర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. వీరిలో కొందరికి ఓటరు ఐడీ కార్డులను అందజేశారు. డీఆర్‌ఓ శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. ఆర్టికల్ 324 ప్రకారం స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం ఏర్పాటు మన దేశంలో ఎంతో గొప్ప వ్యవస్థ అన్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్ మాట్లాడుతూ ఓటరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు భారత ఎన్నికల సంఘం సదవకాశం కల్పించిందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న కొందరికి, అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ఈఆర్‌ఓలు శ్రీనివాస రావు, కనక నరసరెడ్డి, కిరణ్ కుమార్, ఏఈఆర్‌ఓలు శిరీష, షేక్ జరీనా తదితరులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

అలిపిరి నుంచి 3కే రన్

జాతీయ పర్యాటక దినోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు అలిపిరి నుంచి ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు 3 కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, దేవాలయాలతో పాటు చేరువగా సముద్ర తీర ప్రాంతం రావడంతో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ రాంప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థలో పర్యాటకమే కీలకం

మన దేశ ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకంగా వ్యవహరిస్తోందని ఎస్వీయూనివర్సిటీ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ రాజా రెడ్డి మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధి కోసం జాతీయ విధానాలను రూపొందించడానికి పర్యాటక మంత్రిత్వ శాఖ ఒక నోడల్ ఏజెన్సీలాగా పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ వంటి పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు.

సంపదను కాపాడుకుందాం



తిరుపతి మంగళం : చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ అన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక జీవకోనలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాసియ విద్యాలయ పాఠశాల విద్యార్థులను చంద్రగిరి కోటకు తీసుకెళ్లి కోటకు చారిత్రక ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చారిత్రక, వారసత్వ సంపదపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పర్యాటక శాఖ అసిస్టెంట్ మేనేజర్ అపర్ణ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య ప్రయాగ, ఆచార్య విజయకుమార్ రెడ్డి, ఆచార్య పద్మజ, డాక్టర్ తిమ్మప్ప, పర్యాటక శాఖ విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం


దినేష్

చిల్లకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు గూడూరురూరల్ పరిధిలోని తిప్పవరపాడుకు చెందిన దినేష్ 23వ తేదీ సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. దీనిపై స్పందించిన హోం మాస్టర్ బాలవెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పదోన్నతి పొందిన తహసీల్దారుకు ఘన సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ: మండల రెవెన్యూ తహసీల్దారుగా పనిచేస్తూ, పదోన్నతి పొందిన తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడిని బుధవారం వరదయ్యపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దయాకర్‌రెడ్డి, నాయకులు శివకుమార్ పూలమాల వేసి, శాలువతో ఘనంగా సన్మానించారు.

డిమాండ్ల పరిష్కారానికి ఆర్టీసీ ఈయూ వినతి

తిరుపతి అర్బన్: "మా డిమాండ్ల వెంటనే పరిష్కరించండి.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. దాంతో ప్రయాణికులకు, భక్తులకు అసౌకర్యాలకు మీరు బాధ్యత వహించాలి."అంటూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు జిల్లా ప్రజా రవాణ అధికారి చెంగల్‌రెడ్డిని హెచ్చరించారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు బుధవారం తిరుపతిలోని జిల్లా ప్రజా రవాణ అధికారి కార్యాలయంలో డీపీటీవో చెంగల్‌రెడ్డికి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. ఈయూ రాష్ట్ర డిప్యూటీ జాయిన్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీఆర్ కుమార్, జిల్లా అధ్యక్షులు వి.గురునాథం పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారి అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: ఉత్తమ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అవార్డును ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు బుధవారం తిరుపతిలో అందజేశారు. గూడూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 6బీ సేకరణ, ఓటుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమంలో 73 శాతాన్ని పూర్తి చేసిన ఆయనకు ఈ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఆర్‌ఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

గూడూరురూరల్/తిరుపతి తుడా: అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇందుకు గాను అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ 5 ఏళ్లు అనుభం ఉన్న వారు అర్హులని తెలిపారు. పాకాల, ఏర్పేడు, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, తడ, చిట్టమూరు, డీవీ సత్రం, డక్కిలి, వెంకటగిరి, వెదురుకప్పం, పులిచెర్ల, బాలాయపల్లి, సూళ్లూరుపేట, బీఎన్ కండ్రిగ, తొట్టంబేడు, వాకాడు, గూడూరు, రొంపిచెర్ల, యాదమరి మండలాల పరిధిలోని 108 వాహానాలలో పని చేసేందుకు ఈఎంటీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దరఖాస్తులను నేరుగా తిరుపతిలోని మున్సిపల్ పార్కు సౌత్‌రోడ్డు, మధురానగర్‌లోని 108 జిల్లా కార్యాలయంలో ఈ నెల 28వ తేదీలోగా అందించాలని కోరారు.

స్విమ్స్ ప్రొఫెసర్‌కు ఎంబీఎస్‌ఐ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ ఉమామహేశ్వరి

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీ బయో ఇన్‌ఫర్మేటిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరికి మైక్రోబయాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎంబీఎస్‌ఐ)వారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసింది. ఈ మేరకు మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన సంత్ తుకడోజీ మహరాజ్ యూనివర్సిటీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకున్నట్టుమెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు.

30 నుంచి బ్యాంకు ఉద్యోగుల సమ్మె

తిరుపతి అర్బన్: బ్యాంకు ఉద్యోగులు ఈనెల 30, 31 తేదీల్లో సమ్మెకు సిద్ధం కావాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి ధన్వంత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం భోజన విరామం సమయంలో తిరుపతిలోనే మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఎస్‌బీఐ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా వారానికి 5 రోజులు పనిదినాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసింహులు, జనార్ధన్, లక్ష్మీపతి, నిర్మలాదేవి, సుమలత, రేష్మ, భాస్కర్, మహేష్, పవన్, నందగోపాల్, శ్రీనివాస్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు


అనాథ శవాల అంత్యక్రియల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

తిరుపతి తుడా : తిరుపతి ముస్లిం జేఏసీ సేవా కార్యక్రమాలను యజ్ఞంలా నిర్వహిస్తోందని, అందులో భాగంగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ తెలిపారు. రుయా మార్చురీలోని అనాథ శవాలకు ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సంప్రదాయ బద్ధంగా దహన సంస్కారాలను నిర్వహించారు. దీనికి అభినయ్‌రెడ్డి విచ్చేసి, మృతదేహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అభినయ్ మాట్లాడుతూ ముస్లిం జేఏసీ ఇప్పటి వరకు 1500కు పైగా మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించారని కొనియాడారు. కోవిడ్ విజృంభించిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ఆ మృతదేహాలను అంతిమ సంస్కారాలను నిర్వహించి ఆదర్శంగా నిలిచారన్నారు. అంబులెన్స్‌ను సైతం అందుబాటులో వుంచి పేదలకు సేవలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ముస్లిం జేఏసీ, అంబులెన్స్ అసోసియేషన్ సంయుక్తంగా చివరితంతును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్‌రాయల్, ముస్లిం జేఏసీ కన్వీనర్, మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఇమామ్‌సాహెబ్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్రనాథ్ ముస్లిం జేఏసీ సభ్యులు చాంద్‌బాషా, గౌస్, వెంకటేశ్, మంజునాథ్, రాజేష్, పవన్, సలీం పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠాలో ఒకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై దారి దోపిడీకి పాల్పడే ముఠాలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ సోమయ్య, ఎస్సై తిరుమరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మూడు రోజుల కిందట బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన శివకృష్ణ మండలంలోని పోలిరెడ్డిపాళెం సమీపంలోని రహదారిపై బైక్ ఆపి ఉన్న సమయంలో అటుగా బుల్లెట్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు అతనిపై దాడి చేశారు. రాడ్‌తో కొట్టి నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించుకుని వెళ్లారు. చోరీకి గురైన సెల్‌ఫోన్ ఆధారంగా సీఐ, ఎస్సై గాలించి, చెన్నై నగరం అత్తిపట్టుకు చెందిన మనోజ్‌ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు చెన్నైలోని మీంజూరుకు వసంత్, పొన్నేరికి చెందిన విష్ణుగా గుర్తించారు. వీరి కోసం ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముగ్గురిపై తమిళనాడులోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులు వాడిన బులెట్ బైక్ కూడా 22న పొన్నేరులో దొంగిలించినట్లు వివరించారు. దీనిపై బాధితుడు అక్కడ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరిచారు.

తక్కువ ఖర్చుతో రక్త పరీక్షలు

- అత్యాధునిక ల్యాబ్‌ను ప్రారంభించిన టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో తక్కువ ఖర్చుతో రోగులకు రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. బర్డ్‌లో అత్యాధునిక రక్త పరీక్ష కేంద్రం(ల్యాబ్)ను బుధవారం ఉదయం ఈవో ప్రారంభించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బర్డ్, శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రికి వచ్చే రోగులకు రక్త పరీక్షలు నిర్వహించేందుకు రూ.80 లక్షలతో టీటీడీ ఈ రక్త పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇందులో హేమటాలజీ, సేరాలజీ, కోయా గూలేషన్, బయో కెమిస్ట్రీకి సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్విమ్స్, రుయా, బయట ఆస్పత్రుల నుంచి వచ్చే రోగులకు కూడా తక్కువ ఖర్చుతో రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పెథలాజికల్, మైక్రో బయోలాజికల్ టెస్టులు చేయడానికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఇటీవల ఆధునికరించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన రక్త పరీక్షలు నిర్వహించే కేంద్రాన్ని, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, క్లినికల్ పేటాలజీ, బ్లడ్ బ్యాంక్ విభాగాలను పరిశీలించారు. అనంతరం శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం సందర్శించారు. ఇటీవల గుండె మార్పిడి చికిత్స చేయించుకున్న బాలుడిని పలకరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, బర్డ్ ఆస్పత్రి ప్రత్యేక అధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఈఈ శ్రీ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో శ్రీపాద వల్లభ విశ్వనాథ స్వామి


స్వామికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్నవేంకటేశ్వరస్వామిని శ్రీపాద శ్రీవల్లభ వెంకటవిశ్వనాథ స్వామి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తొండమాన్‌పురానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో చెలికం జయచంద్రారెడ్డి, హరికృష్ణారెడ్డి, గంగిరెడ్డి, రాము, ఆలయ పర్యవేక్షకులు ఆనంద్, సదాశివయ్య పాల్గొన్నారు.

గుడిమల్లం పరశురామేశ్వర స్వామి సన్నిధిలో...

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీపాద శ్రీవల్లభ వెంకట విశ్వనాథం స్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. మంగళహారతుల మధ్య ఆలయంలోకి వెళ్లి పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పూలమాలలతో సన్మానించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.